సాక్షి
వికారాబాద్

శనివారం ၊ 27 ၊ జనవరి ၊ 2024



సాహస విన్యాసం చేస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి



భరతమాత, సైనిక వేషధారణలో గురుకుల విద్యార్థులు



బతుకమ్మ శకటంతో పరిగి నంబర్ వన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

న్యూస్‌రీల్

దైవగుణం అలవర్చుకోవాలి

జెడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సునీతారెడ్డి

తాండూరు రూరల్: ప్రతి ఒక్కరూ దైవగుణం అలవర్చుకోవాలని జెడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఖాంజాపూర్ శివారులో గల మిరాకిల్ గ్యాస్పల్ చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చర్చి ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మతాలు ఏవైనా ప్రజలు దైవభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ రెవరెండ్ స్టీవెన్సన్ సతీష్, జాస్వా గుమ్మల్లా, ప్రవక్తలు మైక్, దైవజనుడు ఎరిక్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు శ్రీను, బల్వంత్‌రెడ్డి, రాజు, వెంకటయ్య, నర్సింహులు, రాజరత్నం, ప్రకాశం, బిచ్చప్ప, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న సంఘం సభ్యులు

తాండూరు టౌన్: ఆర్యవైశ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఎమ్మెల్యేను గజమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఆర్యవైశ్యుల వ్యాపారాలకు అండగా ఉంటామన్నారు. అడిగిన వారికి సహాయం చేయడంలో ఆర్యవైశ్యులు ముందుంటారని అన్నారు.

జైలు సూపరింటెండెంట్‌కు ఉత్తమ సేవా పురస్కారం



జైళ్ల శాఖ డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాజ్‌కుమార్

పరిగి: బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన పరిగి సబ్ జైలు సూపరింటెండెంట్ రాజ్ కుమార్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆ శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా చేతుల మీదుగా శుక్రవారం అవార్డు అందుకున్నారు. అంతేకాకుండా జిల్లా స్థాయిలో పురస్కారం అందుకున్నారు. ఇకపై మరింత బాధ్యతగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

అనంతగిరి: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని దర్మ సమాజ్ పార్టీ వికారాబాద్ జిల్లా కన్వీనర్ జి.రవీందర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ రథయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంతోనే సబ్బండ కులాలకు స్వేచ్ఛ, సమానత్వం, ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం జరుగుతోందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు మల్లికార్జున్, వెంకటేష్, శ్రీనివాస్, రాజు, అశోక్, వెంకటేష్, కృష్ణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి

ప్రజాపాలనతో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు

- ఆరు గ్యారంటీల్లో రెండు పథకాలు అమలయ్యాయి
- ప్రపంచంతో పోటీ పడేలా అభివృద్ధి
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నారాయణరెడ్డి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు జిల్లా ప్రజలందరికీ సక్రమంగా చేరవేయడానికి కృషి చేస్తామని కలెక్టర్ సీ నారాయణరెడ్డి అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఎస్పీ కోటిరెడ్డితో కలిసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయా పాఠశాలలు, గురుకుల, మోడల్ స్కూల్, సంఘం లక్ష్మీబాయి పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి తిలకించారు. ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన 241 మంది అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 239 స్వయం సహాయక సంఘాలకు శ్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రుణాలకు సంబంధించిన (రూ. 28.74 కోట్లు) చెక్కులు అందజేశారు. పోలీసు పరేడ్ ఆకట్టుకుంది. పూడూరు మోడల్ స్కూల్, వికారాబాద్ జెడ్పీహెచ్ఎస్ బాలికలు, బాలురు, కొత్తగడి బాలికల గురుకుల పాఠశాల, సంఘం లక్ష్మీబాయి పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వారికి కలెక్టర్, ఎస్పీ, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ మెమోంటోలు అందజేశారు.

సంక్షేమ పాలనే ప్రభుత్వ లక్ష్యం

పారదర్శకతతో సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందించడమే నూతన ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు పథకాలు మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్య శ్రీని అమలు చేసినట్లు తెలిపారు. పేదలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే రాజీవ్ ఆరోగ్యశ్రీ లక్ష్యమన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలోని ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 25,08,608 ఉచిత టికెట్లను మహిళలు వినియోగించుకున్నారని తెలిపారు.

ప్రజాపాలనకు 2,84,275 దరఖాస్తులు

డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు అభయ హస్తం పేరిట ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు స్వీకరించామన్నారు. 2,84,275 మంది వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసినట్లు వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడేలా, సంక్షేమంలో సరికొత్త అధ్యాయం లిఖించాలనే కృతనిశ్చయంతో పని చేస్తోందని తెలిపారు. ప్రజల ఉద్యమ ఆకాంక్షలు, ప్రజా సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం, నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా జిల్లాలో రబీ సాగుకు 2,95,796 మంది రైతులకు రూ.322.76 కోట్లు కేటాయించారని తెలిపారు. ఇప్పటి వరకు 1,68,085మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.95.48 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ కోసం ప్రభుత్వం బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వివరించారు. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.



తాండూరు టౌన్: రామాయణ కావ్యాన్ని నృత్యరూపకంగా ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రైల్వే ప్రాజెక్టులు రయ్‌రయ్



- త్వరలో చర్లపల్లి స్టేషన్ ప్రారంభం
- సికింద్రాబాద్ పునరాభివృద్ధి శరవేగం
- ప్రగతి పథంలో దక్షిణమధ్య రైల్వే: జీఎం

సాక్షి, సిటీబ్యూరో: ఒకవైపు కేంద్ర బడ్జెట్, మరోవైపు పార్లమెంట్ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ.. దక్షిణమధ్య రైల్వే ఇప్పటి వరకు చేపట్టిన పనుల్లో వేగం పెంచింది. రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, సేవల విస్తరణపై దృష్టి సారించింది. గ్రేటర్‌లో చేపట్టిన ప్రధానమైన ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల నియమావళి అమల్లోకి రాకముందే చర్లపల్లి టెర్మినల్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. రెండేళ్లుగా కొనసాగుతున్న చర్లపల్లి స్టేషన్ విస్తరణ, అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి.

- డిసెంబర్‌లోనే చర్లపల్లి టెర్మినల్ సేవలను వినియోగంలోకి తేవాలని భావించినప్పటికీ ఇంకా కొనసాగుతున్న కొన్ని పనులను దృష్టిలో ఉంచుకొని వాయిదా వేశారు. ఫిబ్రవరి నాటికి అన్ని పనులను పూర్తి చేసి లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం. రూ.220 కోట్లతో చర్లపల్లి అభివృద్ధి పనులను చేపట్టారు. ప్రస్తుతం సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లు నగరంలో ప్రయాణికులు రైల్వే సేవలు అందజేస్తున్నాయి. నాలుగో టెర్మినల్‌గా చర్లపల్లి అందుబాటులోకి రానుంది. ప్రతి రోజు సుమారు 50 రైళ్లు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించేందుకు అనుగుణంగా స్టేషన్‌ను విస్తరించారు. కాజీపేట్, విజయవాడ మీదుగా నగరానికి రాకపోకలు సాగించే కొన్ని రైళ్లను చర్లపల్లి నుంచి నడపనున్నారు.

చురుగ్గా పునర్నిర్మాణ పనులు

- అంతర్జాతీయ ప్రమాణాల మేరకు చేపట్టిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునర్నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎయిర్‌పోర్టు తరహాలో ప్రయాణికుల సదుపాయాలు, రైళ్ల నిర్వహణ కోసం రూ.720 కోట్లతో సికింద్రాబాద్ స్టేషన్ పునరభివృద్ధిని చేపట్టిన సంగతి తెలిసిందే. గత ఏడాది ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఇప్పటి వరకు ఉత్తరం వైపు తాత్కాలిక బుకింగ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కొత్త ఆర్పీఎఫ్ భవనం పనులు పూర్తయ్యాయి. దక్షిణం వైపున 80 శాతం పునాదుల తవ్వకాలను పూర్తి చేశారు. బేస్‌మెంట్ -1 స్లాబ్, బేస్‌మెంట్ -2 స్లాబ్ పనులు 60 నుంచి 80 శాతం వరకు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.
- దక్షిణం వైపు ప్రస్తుతం ఉన్న భవనాన్ని విస్తరించడంతో పాటు ఆధునికీకరణ కోసం చేపట్టిన పనులు కూడా 45 శాతం వరకు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉన్న 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ స్థానంలో రెండు 33 కేవీ సబ్‌స్టేషన్లు రానున్నాయి. ఈ మేరకు 33 కెవి ఇఎస్ఎస్ పనులను కూడా తుదిదశలో ఉన్నాయి. ఉత్తరం వైపున మల్టీ-లెవల్ కార్ పార్కింగ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.పునరాభివృద్ధి పనులను సులభతరం చేయడానికి ఉత్తరం వైపున ప్రస్తుతం వాడుకలో ఉన్న 25 శాతం స్టేషన్ భవనాన్ని ఖాళీ చేసి పనుల వేగవంతానికి చర్యలు చేపట్టారు.

ఇప్పటివరకు రూ.14,738 కోట్ల ఆదాయం

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులపై దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సంతృప్తి వ్యక్తం చేశారు. రిపబ్లిక్ డే సందేశంలో భాగంగా ఆయన దక్షిణమధ్య రైల్వే ప్రగతిని వివరించారు. ఇప్పటి వరకు రూ.14,738 కోట్ల ఆదాయం లభించిందన్నారు. గత ఏడాది కంటే ఇది రూ. 950 కోట్లు అధికమని పేర్కొన్నారు. దక్షిణమధ్య రైల్వేలో రూ.7 వేల కోట్లతో 119 స్టేషన్లను పునరభివృద్ధి చేసేందుకు అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా పనులు చేపట్టినట్లు ఆయన వివరించారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు

‘భట్టి’కి ఘన స్వాగతం

షాబాద్‌మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు శుక్రవారం స్థానిక నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో క్రేన్‌తో గజమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క చందనవెల్లి భూ బాధితులతో మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్ 190 లో భూ సేకరణలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపిస్తామని రైతుల కు హామీ ఇచ్చారు. ఎంజాయ్‌మెంట్ సర్వే పేరిట భూమిలేని వారి పేర్లను భూ సేకరణలో చేర్చి నిజమైన రైతులకు పరిహారం ఇవ్వలేదని.. గతంలో తాను ఈ గ్రామానికి వచ్చిన సందర్భంగా బాధితులు తన దృష్టికి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రావాల్సిన పరిహారం డబ్బులను కొల్లగొట్టిన దళారులపై విచారణ చేయించి, వాస్తవాలు బయటికి తీసుకువస్తామన్నారు. భూ బాధితులకు స్థానికంగా ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ప్రజల్లోనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



తాండూరు ఆర్‌డీఓ శ్రీనివాసరావు



డీఆర్‌డీఓ కృష్ణన్



డీఈఓ రేణుకాదేవి



వికారాబాద్ ఆర్‌డీఓ విజయకుమారి

ఉత్తమ సేవలకు పురస్కారాలు

అనంతగిరి: గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ఆయా శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు శుక్రవారం వికారాబాద్‌లోని ఎస్పీ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి అవార్డులు అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌డీఓ కృష్ణన్, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పల్వాన్ కుమార్, డీసీఓ శంకరాచారి, డీఈఓ రేణుకాదేవి, డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, ఈడీఎం మహమూద్, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, వికారాబాద్ ఆర్‌డీఓ విజయకుమారి, తాండూరు ఆర్‌డీఓ శ్రీనివాసరావు ఉన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి పాల్గొన్నారు.



డిప్యూటీ సీఈఓ సుభాషిణి



ఈడీఎం మహమూద్



డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్



డీసీఓ శంకరాచారి



డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్

మది నిండుగా.. తిరంగా పండుగ

75వ గణతంత్ర వేడుకలను వికారాబాద్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, పలువురు ఉన్నతాధికారులు వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం పోలీసుల కవాతు, చిన్నారుల నృత్యప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి కలెక్టర్ నారాయణ రెడ్డి అవార్డులను అందజేశారు. వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు.

– అనంతగిరి



మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను అందజేస్తున్న కలెక్టర్



స్టాల్స్‌లో గన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



ట్రై సైకిళ్లను అందజేస్తున్న కలెక్టర్



అవార్డు అందుకుంటున్న పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి



వికారాబాద్ సీఐ టి.శ్రీను



పరిగి ఎస్‌ఐ సత్యనారాయణ



టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ ప్రశాంత్ వర్ధన్



బషీరాబాద్ ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్



ఆర్ఎస్‌ఐ శ్రీనివాస్ బాబు



ఐటీ విభాగం ఎస్‌ఐ శ్రీను



సూపరింటెండెంట్ మిర్జా జావీద్ బేగ్



తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి



గిర్దవరి వెంకటగిరి



తహసీల్దార్ గణేశ్



తహసీల్దార్ విజయ్‌కుమార్



కొడంగల్ డీటీ రమేశ్



ధారూరు ఏఎస్‌ఐ సంజీవరావు



క్లూస్ టీం ఏఎస్‌ఐ వి.లక్ష్మణ్



ఎస్సీ హాస్టల్ వార్డెన్ హన్మంత్‌రెడ్డి



డీపీఆర్ఓ సిబ్బంది సతీశ్



డీఆర్‌డీఏ సిబ్బంది సత్యనారాయణ



మెప్మా పీడీ రవికుమార్



మెప్మా టీఎంసీ వెంకటేశ్

క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న రఘువీరారెడ్డి

ధారూరు: అసెంబ్లీ స్పీకర్ సతీమణి శైలజ జ్ఞాపకార్థం నిర్వహించ తలపెట్టిన క్రికెట్ టోర్నీ శుక్రవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో నూ రాణించాలని సూచించారు. త్వరలో జిల్లా స్థాయి కుస్తీ పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అజీంఖురేషి, సర్పంచ్ చంద్రమౌలి, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్, అవినాశ్‌రెడ్డి, లింగనపల్లి అశోక్, ముజాఫర్, రాఘవేందర్‌గౌడ్, ఇబ్రహీం, అంజయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న కూలీ మృతి



వీరేశం మృతదేహం

ధారూరు: ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని మందగడ్డ కాలనీలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్, కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. తరిగోపుల వీరేశం(46) కూలీ పనులు చేస్తూ వచ్చిన డబ్బంతా మద్యానికి ఖర్చు చేస్తుండేవాడు. భార్య పద్మ వద్ద సైతం డబ్బు తీసుకుని మద్యం సేవించేవాడు. ఈ నెల 17న మద్యం తాగేందుకు భార్యను డబ్బు అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో గొడవపడి వెళ్లిపోయాడు. రాత్రి తలుపుతట్టగా భార్య వచ్చి చూసేవరకు వీరేశం కిందపడి దొర్లుతున్నాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యుల సాయంతో భర్తను వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ పరిశీలించి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశాడు. చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

పరిహారం చెల్లించండి

స్టీల్ ఫ్యాక్టరీ ఎదుట రైతుల ఆందోళన



ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేస్తున్న నారాయణపూర్ రైతులు

పరిగి: ఫ్యాక్టరీ కాలుష్యం కారణంగానే పంట నష్టం వాటిల్లుతోందని నారాయణపూర్ రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ సమీపంలో సుగుణ స్టీల్ ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కొంతమంది రైతులకు మాత్రమే నష్ట పరిహారం చెల్లిస్తోందని ఫ్యాక్టరీ మా గ్రామ శివారులో ఉండి పంట నష్టపోతున్నా ఎటువంటి పరిహారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ వ్యర్థాల నుంచి నారాయణపూర్ రైతులు ఎంత నష్టపోతున్నారో గుర్తించి నష్టం వాటిల్లితేనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు నిత్యం ఫ్యాక్టరీ చుట్టూ తిరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం సరికాదన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చేయూత

శంషాబాద్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చేయూతనందిస్తానని కౌన్సిలర్ లావణ్యాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని తొండుపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం ఒక్కో పాఠశాలకు రూ. 20 వేల చొప్పున మొత్తం రూ. 40 వేలను ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం అందజేశారు. అంతేగాకుండా సుమారు 500 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులతో పాటు పరీక్షా ప్యాడ్లను పంపిణీ చేశారు. ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పెంటయ్య, కొండ దర్శన్, కొండ పరమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ రత్నం, గోవర్ధన్‌గౌడ్, విష్ణు, రాజు, విశ్వనాథం, ముస్తఫా, సుక్క, పాండు, శ్రీధర్, రమేశ్, రాజు పాల్గొన్నారు.

‘ఇగ్నైట్ ఫెస్ట్’లో మెరిసిన గురుకుల విద్యార్థి

రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్న హరిచంద్

కొడంగల్ రూరల్: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వంహించిన పోటీల్లో కొడంగల్ గిరిజన గురుకుల విద్యార్థి సత్తాచాటాడు. ఈ నెల 8,9 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇగ్నైట్ ఫెస్ట్‌లో పాఠశాలకు చెందిన పి.హరిచంద్ ప్రథమ స్థానంలో నిలిచాడు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురుకుల విద్యాలయాల సంస్థల కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్, డిప్యూటీ కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి హరిచంద్‌కు రూ.5వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల పిన్సిపాల్ బలరాం, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ఘనంగా సన్మానించారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న డాక్టర్ నవీన్‌నికోలస్

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిబట్ల టౌన్‌లో పల్లె బాలమణి స్మారకార్థం పల్లె రజినికాంత్‌గౌడ్ ఆదిబట్ల ప్రీమియర్ లీగ్–7 క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేశారు. ఈ పోటీలను శుక్రవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు వ్యాయామం అలవాటు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. త్వరలోనే మున్సిపల్ పరిధిలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మహిపాల్, నిర్వాహకులు పల్లె రజినికాంత్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఈసీ శేఖర్‌గౌడ్, రాజు, కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, సాంబయ్యగౌడ్, పండాల శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసు ఛేదించిన పోలీసులకు బహుమతి

కద్లాల్: టిప్పర్ చోరీ కేసును మూడు రోజుల్లోనే ఛేదించిన పోలీసులకు ఉన్నతాధికారులు నగదు బహుమతి అందజేశారు. మండల పరిధిలోని గడ్డమీది తండాలో గతేడాది డిసెంబర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు టిప్పర్ వాహనాన్ని చోరీ చేశారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. సిబ్బంది రాంకోటి నాయక్, శ్రీధర్, శేఖర్, మహేశ్ సీసీ కెమెరాలతో పాటుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాహనం కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మూడు రోజుల్లోనే కేసు ఛేదించిన పోలీసులకు ఒక్కొక్కరికి రూ.వేయి చొప్పున నగదు బహుమతి అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న సీఐ శివప్రసాద్

మణికొండలో ఎగ్జిబిషన్ ప్రారంభం

మణికొండ: దేశవ్యాప్తంగా చేతివృత్తుల వారు తయారు చేసిన బట్టలు, గృహోపకరణ, అలంకరణ వస్తువుల ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ మణికొండ పైప్‌లైన్ రోడ్డులో, పాత ఆంధ్రాబ్యాంక్ పక్కన సుందర్ గార్డన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ప్రారంభమయ్యింది. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రెస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటిరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సు లు, గృహోపకరణ వస్తువులను విక్రయిస్తున్నారు. అనేక రాష్ట్రాల్లో చేతి వృత్తి కళా కారులు తయారు చేసిన వస్తువులన్నీ ఒకే చోట మంచి నాణ్యతతో లభిస్తుండడంతో కొనుగోలుదారులు మొదటి రోజు పెద్ద ఎత్తున తరలివచ్చారని నిర్వాహకుడు అక్బర్ అలీ తెలిపారు. ఫిబ్రవరి 18 వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని పేర్కొన్నారు.



డ్రెస్ మెటీరియల్‌ను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని చింతపల్లిలో పంచాయతీ భవనం ప్రారంభోత్సవం, అంబేడ్కర్ కళాభవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో విద్య, వైద్య రంగాలతో పాటుగా గ్రామాలను అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గత పాలకుల చేతిలో నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడిందని ఆరోపించారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్‌కు చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం పలువురు ప్రజాతినిధులు గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు, ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, సర్పంచ్ మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జంగయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, మాజీ అధ్యక్షుడు రాములు, నాయకులు కృష్ణనాయక్, మల్లయ్య, మహేశ్, విజయ్, కొప్పు యాదయ్య పాల్గొన్నారు.

శంకరయ్యగౌడ్ సేవలు చిరస్మరణీయం

కద్తాల్: బడుగుల అభ్యున్నతికి అయిళ్ల శంకరయ్యగౌడ్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మైసిగండిలో శంకరయ్యగౌడ్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శంకరయ్యగౌడ్ ఫొటోవద్ద పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అయిళ్ల లక్ష్మమ్మ, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, సీఐ శివప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ కరుణశ్రీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహరెడ్డి, తులసీరాం, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీక్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, గౌడ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అల్లాజీగౌడ్, మాజీ సర్పంచ్‌లు శేఖర్‌గౌడ్, నరేందర్, నాయకులు హర్యానాయక్, హిరాసింగ్, జవహర్, పుల్లయ్య, దూద్యా, శ్రీను, కృష్ణ, పద్మశ్రీ తదితరులున్నారు.



ఆమనగల్లు: చింతలపల్లి గ్రామ పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

‘భారత్ బంద్’ను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసన వచ్చే నెల 16న నిర్వహించ తలపెట్టిన భారత్‌బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని సంఘం ఉపాధ్యక్షుడు సాయిబాబు ఆధ్వర్యంలో ఐటీసీఎల్ ప్లాంట్‌లో డ్రైవర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. లేబర్ చట్టాలను మార్చి మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక లోకానికి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముగాస్తూ కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీలను పట్టించుకోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేఖంగా భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నామని చె ప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మల్లేశ్, డ్రైవర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

బండ్లగూడ: ప్రజలకు ఇబ్బందుల్లేకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ పుష్పా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లక్ష్మీనగర్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, ఎర్రకుంట కట్ట వరకు చేపడుతున్న డ్రైనేజీ పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ. 60 లక్షలతో పైపులైన్ ద్వారా రఘురామనగర్ నుంచి లక్ష్మీనగర్, భాగ్యనగర్ మీదుగా డ్రైనేజీలు అనుసంధానం చేస్తామన్నారు. అపార్ట్‌మెంట్స్, బిల్డింగులు పెరగడంతో పాత డ్రైనేజీ సిస్టం కెపాసిటీ చాలా తక్కువ ఉందని, వాటిని తొలగించి నూతన పైపులైన్ వ్యవస్థను వేయిస్తున్నామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తు సకాలంలో పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గణతంత్ర వేడుకలకు వెళ్తూ..

- ఆగిఉన్న లారీని ఢీకొట్టిన బైక్
- ఉపాధ్యాయుడి దుర్మరణం



లక్ష్మారెడ్డి(ఫైల్)

కొందుర్గు: గణతంత్ర దినోత్సవం గ్రామంతో పాటుగా పాఠశాలలో విషాదం నింపింది. కొందుర్గు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం బండ ఎల్కిచర్లకు చెందిన లక్ష్మారెడ్డి(40) కర్మాన్‌ఘాట్ ప్రాంతంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య శిరీషారెడ్డి బండ ఎల్కిచర్ల సర్పంచ్. కొంతకాలంగా ఆయన భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. రిపబ్లిక్ డే ఉత్సవాలకు భార్యను స్వగ్రామంలో గురువారం రాత్రి దింపాడు. తాను పనిచేసే పాఠశాలలో వేడుకలకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉదయం 6.30గంటల ప్రాంతంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు



కుల్కచర్ల: పాడె మోస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

అండగా ఉంటాం: ఎమ్మెల్యే టీఆర్ఆర్

కుల్కచర్ల: లక్ష్మారెడ్డి మరణం తమకు వ్యక్తిగతంగా మరియు పార్టీకిసైతం తీరనిలోటని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన లక్ష్మారెడ్డి అంత్యక్రియలలో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానన్నారు.

రహదారుల అభివృద్ధికి పెద్దపీట



రహదారి విస్తరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా మారాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. పట్టణ చౌరస్తా నుంచి అన్నారం వై జంక్షన్ వరకు పాత జాతీయ రహదారి విస్తరణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రోడ్డు విస్తనరణకు ఆందోళనలు చేపట్టి అదే రోడ్డును తాను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బీష్వ కిష్టయ్య, తాండ్ర కాశీనాథ్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, బాబర్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, జమృత్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఇబ్రహీం, అప్పి, ముబారక్, అందెమోహన్ పాల్గొన్నారు.